నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | అక్టోబర్ 20, 2024 | www.navatelangana.com

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని మాండగడ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు శనివారం కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు సంతోష్, మశ్చందర్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశన్న, గణేష్, మోర శ్రీకాంత్, నిలేష్, సంతోష్, అశోక్, రవీందర్, పాఠశాల సిబ్బంది చంద్రమణి, అర్చన, సునంద, అస్మా రషీద్ పాల్గొన్నారు.



గంగపుత్రుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-ఉట్నూర్

మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం రాయితీతో చేప పిల్లలను అందజేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గోపయ్య చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గంగపుత్రులను పట్టించుకోలేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



వీఐపీ వస్తేనే..ప్రారంభమా..?

- రిమ్స్‌లో ఎంఆర్ఐ యంత్రం ఉన్నా ఉపయోగం సున్నా
- ఆస్పత్రికి వచ్చి పది నెలలు కావచ్చినా మొదలుకాని వైనం
- రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధుల రాక కోసం ఎదురుచూపు
- వ్యాధి నిర్ధారణ కోసం ఇతర ప్రాంతాలకు బాధితులు

ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంఆర్ఐ యంత్రం ఉన్నా ఉపయోగం సున్నాగా మారింది. యంత్రం వచ్చి పది నెలలు కావస్తున్నా వృథాగా ఉంటోంది. రాష్ట్రస్థాయి వీఐపీ వస్తేనే ప్రారంభించాలని అధికారులు భావించడం కారణంగా అతి ముఖ్యమైన ఈ స్కానింగ్ ప్రారంభానికి నోచుకోవడం లేదు. రెండు నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన ఖరారు కావడంతో ఈ యంత్రాన్ని ప్రారంభిస్తారని అధికారులు ప్రకటించారు. కానీ అనివార్య కారణాలతో ఆయన పర్యటన రద్దు కావడం..ఈ యంత్రం ప్రారంభించడం వాయిదా పడింది. ఫలితంగా అనేక మంది బాధితులు వ్యాధి నిర్ధారణ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒకటి రెండు చోట్ల మాత్రమే పరిమితమైన ఈ యంత్రం ఆదిలాబాద్‌లో అందుబాటులో ఉన్నా.. ఉపయోగం లేకుండా పోయింది. అన్నీ ఉన్నా..అల్లుడి నోట్లో శని ఉన్నట్లు ..అనే సామెతను గుర్తు చేస్తోంది ఈ పరిస్థితి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి


ఎంఆర్ఐ ..మనిషి శరీరంలో కంటికి కనిపించని వ్యాధి ఏ మూలన దాగి ఉన్నా ఇట్టే కనిపెట్టే అతి కీలకమైన యంత్రం ఇది. రాష్ట్రంలో ఒకటి రెండు ఆస్పత్రుల్లో తప్పితే ఎక్కడా కనిపించని ఈ యంత్రం ప్రస్తుతం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో అందుబాటులో ఉంది. కానీ ఎలాంటి ప్రయోజనం కలగడం లేదు. గత ప్రభుత్వం రూ.11కోట్లు వెచ్చించి రిమ్స్‌కు ఈ యంత్రాన్ని సమకూర్చింది. జర్మనీ నుంచి ఈ ఏడాది జనవరిలో వచ్చింది. ప్రస్తుతం ఆస్పత్రిలో అమర్చిన ఈ యంత్రానికి అవసరమైన టెక్నీషియన్లు కూడా అందుబాటులో ఉన్నారు. కానీ రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులు వచ్చి ప్రారంభించే వరకు పనిచేయని విధంగా మారింది. కిందటి ఆగస్టు నెలలో రిమ్స్‌లో ఈ యంత్రంతో పాటు మహిళా శక్తి క్యాంటీన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని అధికారులు ప్రకటన విడుదల చేశారు. అధికారికంగా ఆయన పర్యటన కూడా ఖరారైంది. కానీ ప్రారంభ సమయం రాగానే అనివార్య కారణంతో సీఎం పర్యటన రద్దు అయినట్లు ప్రకటించారు. దీంతో ఎంఆర్ఐ యంత్రం ప్రారంభం అర్థాంతరంగా నిలిచిపోయింది. రిమ్స్ అధికారులు అత్యవసర సమయాల్లో ఈ యంత్రం ద్వారా సుమారు 300వరకు స్కానింగ్‌లు చేయించినట్లు తెలిసింది. కానీ అధికారికంగా ప్రారంభించకపోవడంతో అనేక మందికి తెలియడం లేదు.

ఇతర ప్రాంతాలకు బాధితులు..!

జిల్లాలో ప్రస్తుతం ప్రయివేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ ఎంఆర్ఐ యంత్రం అందుబాటులో లేకపోవడంతో జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తలలో గాయాలు, నరాలకు సంబంధించిన సమస్యలు, తలలో అంతర్గత రక్తస్రావంతో పాటు ప్రమాదాల బారిన పడినవారికి పూర్తిస్థాయి వ్యాధి నిర్ధారణ కోసం ఎంఆర్ఐ స్కానింగ్ చేయించడం తప్పనిసరిగా మారింది. ప్రస్తుతం రిమ్స్‌లో న్యూరోసర్జన్ సైతం అందుబాటులో ఉన్నారు. కానీ ఆయన ఎంఆర్ఐ రాయాల్సి వస్తే స్కానింగ్ కోసం నిర్మల్, నిజామాబాద్, హైదరాబాదు ప్రాంతాల్లోని ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. స్థానికంగా అనేక మంది ప్రయివేటు ఆస్పత్రుల వైద్యులు సైతం ఎంఆర్ఐ స్కానింగ్ రాస్తుండటంతో బాధితులు తప్పనిసరిగా పరిస్థితిలో ఆయా ప్రాంతాలకు వెళ్లి రూ.6వేల నుంచి రూ.10వేల వరకు చెల్లించి స్కానింగ్ చేయించుకుంటున్నారు. ఈ స్కానింగ్ కోసం డబ్బులు లేని వారు వ్యాధి ముదిరి మరింత అనారోగ్య సమస్యలకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారిని హైదరాబాదుకు రిఫర్ చేయాల్సి వస్తోంది.

ప్రారంభిస్తే ప్రయోజనం..!

వీఐపీ వస్తేనే ప్రారంభించాలనే యోచనలో అధికారులు ఉండటంతో కీలకమైన ఈ యంత్రం జనాలకు ఉపయోగడం లేదు. ఇప్పట్లో సీఎం పర్యటన ఖరారయ్యే అవకాశం లేకపోవడంతో మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు లేదంటే ఆస్పత్రి అభివృద్ధి కమిటీ(హెచ్‌డీఎస్) ఛైర్మెన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ ద్వారానైనా ఈ యంత్రాన్ని ప్రారంభించాలని జిల్లావాసులు కోరుతున్నారు. రిమ్స్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఈ యంత్రం ప్రస్తుతం మరమ్మతులకు గురైంది. దీంతో ఆ విభాగానికి అధికారులు తాళం వేశారు. ఢిల్లీ నుంచి టెక్నీషియన్లను రప్పించి మరమ్మతులు చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. యంత్రం బాగుచేసిన తర్వాత ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తే అనేక మంది పేదలకు మెరుగైన వైద్య సేవలు లభించేందుకు ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రిమ్స్‌లో ఎంఆర్ఐ యంత్రం ప్రారంభం విషయమై రిమ్స్ డైరెక్టర్ డా.జైసింగ్ రాథోడ్‌ను సంప్రదించగా.. కొన్ని కారణాలతో ఆలస్యం జరిగిందని.. అతి త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.



ఘనంగా బతుకమ్మ నిమజ్జనాలు



నవతెలంగాణ-తాంసి

తాంసి మండల కేంద్రంతో పాటు బండల్‌నాగపూర్, భీంపూర్ మండలంలోని కరంజి, గుబిడి, పిప్పల్‌కోటి, అంతర్గాం గ్రామాలలో శనివారం బతుకమ్మ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు ఆటపాటలతో బతుకమ్మ నిమజ్జనాల్లో పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి పసుపుతో చేసిన గౌరమ్మను బతుకమ్మపై పెట్టి గద్దెల దగ్గరకు తీసుకెళ్లారు. జానపద పాటలతో పాటు కోలాటాలు, చప్పట్లతో సమీప వాగుల వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. తర్వాత వెంట తెచ్చుకున్న పెరుగన్నం ప్రసాదంగా స్వీకరించారు. ఆయా గ్రామాలలో గ్రామస్తులు మహిళలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు.

స్వశక్తి సమాఖ్య సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-ఖానాపూర్

పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో స్వశక్తి పట్టణ సమాఖ్య జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం హాజరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పొదుపు ఖర్చుల లెక్కలు నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళ సభ్యుల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్‌ను, మెప్మా పీడీ సుభాష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిషోర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, నాయకులు పరిమి సురేష్, జన్నారపు శంకర్, అమానుల్లాఖాన్, మెప్మా అధికారులు, సిబ్బంది, మహిళా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి పార్లర్ ఏర్పాటు

నవతెలంగాణ-ఖానాపూర్

ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా శనివారం బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేశారు. దీన్ని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి పథకం ద్వారా ఆర్థిక సాయంగా రూ.5లక్షలు అందిస్తుందన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఆడపడుచులకు అండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లోన్ ద్వారా మహిళలు సొంతగా షాపులను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదుగుతున్నారని అన్నారు. ఖానాపూర్ పట్టణ స్థాయి బ్యాంకర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశామని, ఇందులో బ్యాంకు లోన్స్, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ లోన్స్ గురించి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్ నాయక్, నాయకులు పరిమి సురేష్, జన్నారపు శంకర్, అమానుల్లాఖాన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ఈ నెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా(టియుసిఐ)లో ఐఎఫ్టియు విలీన సభ సభ పోస్టర్లను సోఫీనగర్ బీడీ కార్మికులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని తెలిపారు. రోజురోజుకూ కొత్త పరిజ్ఞానంతో యాంత్రీకరణ విపరీతంగా జరుగుతోందని కానీ కార్మికుల భద్రతకు చర్యలు శూన్యంగా ఉన్నాయని తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు చేస్తూ పాలకవర్గాలు కార్మికవర్గంపై దాడికి పూనుకున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గంగామణి, లక్ష్మి, విజయ, కవిత, రుక్మ పాల్గొన్నారు.

టీయూసీఐలో విలీన ప్రకటనతో ఐఎఫ్‌టీయూకు సంబంధం లేదు

ఆదిలాబాద్‌టౌన్ : టీయూసీఐలో విలీన ప్రకటనకు మాతృ సంస్థ ఐఎఫ్టీయూకు ఎలాంటి సంబంధం లేదని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి బి.వెంకట్‌నారాయణ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్టీయూ మౌలిక అవగాహనను, సంస్థ రాజకీయ విధానాలను విభేదిస్తూ కొంతమంది ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో బయటికి వెళ్లిన ఒక విభాగం ఐఎఫ్టీటీయూ పేరుతోనే సంస్థను ఏర్పాటు చేసుకొని కొనసాగుతూ ఆ విభాగాన్ని టీయూసీఐ సంస్థలో విలీనం చేస్తున్నట్లు ప్రకటన జారీ చేశారని పేర్కొన్నారు. కానీ ఈ ప్రకటనతో మాతృ సంఘమైన ఐఎఫ్టీయూకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ ప్రకటన ఐఎఫ్టియు శ్రేణులను, కార్మిక వర్గాన్ని గందరగోళానికి గురి చేస్తోందన్నారు. కార్మిక వర్గ శ్రేణులు సంస్థ వెనకాల దృఢంగా నిలబడాలని కోరారు. ముఖ్యంగా ఐఎఫ్టీయు శ్రేణులు మరింత ఐక్యంగా దృఢంగా సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు గౌరాల సుభాష్, గంగమ్మ, శ్యామ్, సునీత, లక్ష్మీ పాల్గొన్నారు.

చదువుతోపాటు కళల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

విద్యార్థులకు చదువుతోపాటు కళల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. స్థానిక జెవిఎస్ఆర్ హైస్కూల్ శాంతినగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలలు మానసికోల్లాసానికి ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ఏ కళలో నైపుణ్యం ఉంటుందో దాన్ని సాధన చేయాలని తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయిలో పాల్గొని జిల్లా పేరును నిలపాలన్నారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా నలుమూలల నుండి వివిధ పాఠశాలల విద్యార్థులు జానపద గీతాలు, జానపద నృత్యాలు, చిత్రలేఖనం, సంగీత వాయిద్యం, ఏకపాత్రాభినయం, కథ రచన వంటి అంశాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ నర్సయ్య, సిద్ధ పద్మ జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ వినోద్, పాఠశాల ప్రిన్సిపల్ మణికుమారి, న్యాయ నిర్ణేతలు నవ్య, నాగరాజు, విశ్వనాథ్ వర్మ, పోతన్న, రఫిక్, ఎర్రన్న, దేవి, ప్రియ, వనజ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎం భద్రతకు పటిష్ట బందోబస్తు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల ప్రక్రియలో ముఖ్యభూమిక పోషించే ఈవియంల భద్రతను నిర్లక్ష్యం చేయకుండా నిరంతర నిఘా, పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం పట్టణంలోని శాంతినగర్ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఈవియం స్ట్రాంగ్ రూంను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఓటింగ్ మిషన్ల సంఖ్య, వాటి స్థితిగతులను పరిశీలించారు. అనంతరం స్ట్రాంగ్ రూం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి భద్రతకు తీసుకుంటున్న చర్యలను అక్కడి పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిరంతర నిఘాతో ఈవియంలకు గట్టి భద్రత కల్పించాలని, ఏమరుపాటుగా ఉండవద్దని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి, పార్టీల నాయకులు బండి దత్తాత్రి, వేదవ్యాస్, ప్రశాంత్ ఉన్నారు.

దేవరకోటలో శ్రీహరిరావు ప్రత్యేక పూజలు

నిర్మల్ రూరల్ : పట్టణంలోని పురాతన దేవాలయం శ్రీవెంకటేశ్వర స్వామిని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం దేవరకోట దేవస్థాన నూతన చైర్మన్ కొండ శ్రీనివాస్ దంపతులు శ్రీహరిరావుని శాలువాతో సన్మానించారు. ఈయన వెంట మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, ఏఎంసీ చైర్మన్ సోమ భీంరెడ్డి, పట్టణ అధ్యక్షులు చిన్ను, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, నిర్మల్ మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి , కొట్టే శేఖర్, గణేష్, బురాజ్ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం ప్రారంభం



నవతెలంగాణ - కాసిపేట

మండలంలో ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్లో పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూటీఎస్ జిల్లా గౌరవాధ్యక్షురాలు బండ శాంకరి మాట్లాడుతూ నవంబర్ 1, 2018 నుండి నవంబర్ 1, 2024 లోపు హైస్కూల్స్‌లో మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఓటును తహసీల్దార్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. అత్యధిక మెజారిటీ కలిగిన పీఆర్టీయూటీఎస్ సంఘం ఉపాధ్యాయ శాసన మండలి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న వంగ మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీచర్ల సమస్యల సాధన కోసం పీఆర్టీయూటీఎస్ అలుపెరుగని పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. 010 ద్వారా వేతనాలు తీసుకోవడం, మోడల్ స్కూల్ ట్రాన్స్‌ఫర్స్ సాధన చేసినట్లు తెలిపారు. మినిమం టైం స్కేల్, పీఆర్సీ, పెండింగ్ బిల్స్, డీఏలు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొరకు పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జ్యోతి, జిల్లా నాయకులు అన్నం రమణారెడ్డి, మండల కార్యదర్శి పల్లెకృష్ణ గోపాల్‌రావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ కౌన్సిలర్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టర్ రాజర్షిషాను కాంగ్రెస్ కౌన్సిలర్లు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో నెలకొన్న సమస్యలు, మిషన్ భగీరథకు సంబంధించిన నీటి సరఫరా సమస్యలపై కలెక్టర్‌కు విన్నవించారు. చాలారోజుల నుండి పట్టణంలోని కొన్ని వార్డులలో మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడం గురించి వివరించారు. స్వయంగా ఫోన్ చేసి చెప్పినా కేవలం ఆ రెండు రోజులు మాత్రమే నీటి సరఫరా చేస్తున్నారని మళ్లీ సరఫరా నిలిపివేస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు ఆవుల వెంకన్న, సతీష్, కలాల శ్రీనివాస్, భూమన్న, సంద నర్సింగ్ ఉన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసిన తెలుగు ఉపాధ్యాయురాలు మాలతి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ఉద్యోగోన్నతిపై వెళ్లడంతో శనివారం ఇంత కాలం పనిచేసిన పాఠశాలలో తన గుర్తుగా రూ.18వేల విలువతో కూడిన సౌండ్ సిస్టంను ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన మాలతి శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం ఉద్యమించాలి



నిర్మల్‌టౌన్ : ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గౌతమ్‌కృష్ణ అన్నారు. నిర్మల్ రూరల్ మండల ప్రథమ మహాసభ టిఎన్జీవో భవన్‌లో ప్రసాద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. సీపీఐ(ఎం) మండలంలో అనేక పోరాటాలు నిర్మించి విజయం సాధించిందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్‌కార్డు సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతుబంధు, ఆసరా పింఛన్లు, ఇందిర ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్ మండల కమిటీ ఎన్నిక

సీపీఐ(ఎం) నిర్మల్ మండల నూతన కార్యదర్శిగా బి.సుజాత ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ కార్యక్రమంలో శైలజ, రాజమణి, శారద, లక్ష్మి, విజయ, సుగుణ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ త్వరగా పూర్తిచేయాలి



ఖానాపూర్ : అక్రమ లేఅవుట్‌లలో ఉన్న ప్లాట్‌లకు ఎల్ఆర్ఎస్ త్వరగా పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని సత్తెనపల్లి గ్రామంలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించారు. అంతేకాకుండా ఆయా గ్రామాలలో ఈ నెల ఆఖరి వరకు 50 శాతం ట్యాక్స్ వసూలు చేయాలని సూచించారు. వివిధ వృత్తుల లబ్ధిదారుల ఎంపిక వారు చేసే పనులు బట్టి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ రమేష్, ఇండస్ట్రియల్ మేనేజర్ నరసింహారెడ్డి, ఎంపీడీవో సునీత, మండల పంచాయతీ అధికారి రత్నాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగులైన యువకులకు కేంద్ర ప్రభుత్వ దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన(డిడియుజికెవై) పథకంలో భాగంగా న్యాక్ ఆధ్వర్యంలో 3నెలల ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాక్ ల్యాండ్ సర్వే, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లుపేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తు యూనిఫాం, స్టేషనరీ, శిక్షణ సామాగ్రి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు వివిధ కంపెనీలలో ఉపాధి కల్పిస్తామని వెల్లడించారు. అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలు కలిగి ఉండలాని, శిక్షణ కొరకు విద్యార్హత సర్టిఫికెట్, కులధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, నివాస ధృవీకరణ పత్రాలు, రేషన్, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో న్యాక్ కార్యాలయంలో ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9154548063 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పశువులకు గాలికుంటు టీకాలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ప్రతి ఒక్కరూ తమ పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోవాలని పశువైద్యులు రాథోడ్ సుభాష్, సుదేష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ధనోర(బి), శంకర్‌గూడ తదితర గ్రామాల్లో గాలికుంటు వ్యాధి టీకాలను చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులకు వ్యాధి రాక ముందు ఈ టీకాలను వేయించుకోవాలన్నారు. వ్యాధి సోకిన తరువాత చికిత్స చేసే ముందు ప్రతి ఆరు నెలలకొకసారి ఎఫ్ఎండీ టీకాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. వచ్చే నెల 14 వరకు ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాందాస్, హీరాలాల్, భూమన్న ఉన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్



బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని గాదిగూడ టీజీబీ బ్యాంక్ మేనేజర్ మౌనిత్‌రెడ్డి సూచించారు. శనివారం గాదిగూడ మండలంలోని పరస్వాడ, హిరాపూర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. క్రాప్‌లోన్, మహిళ సంఘాల రుణాలు సక్రమంగా వినియోగించి తిరిగి చెల్లించాలని అన్నారు. దీనిపై కళాజాత బృందం ద్వారా మ్యాజిక్ షో రూపంలో ప్రజలకు తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్‌రెడ్డి బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి..

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని ఖండాల, అంకాపూర్ గ్రామాలలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ఈనెల 24న ఆదిలాబాద్ పట్టణంలోని రామ్‌లీలా మైదానంలో చేపట్టే ఈ నిరసన కార్యక్రమంలో రైతులు, కార్మిక, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ మోసపూరిత హామీలతో 420 నాయకులు అధికారంలోకి వచ్చారన్నారు. రైతులను ఆదివాసులను మోసం చేస్తూ, ప్రజా సంక్షేమ పథకాలను కాలరాస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంద్రత్ రమేష్, మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, జగదీష్ యాదవ్, పరమేశ్వర్, రమణ, అప్కమ్ గంగయ్య, జంగుబాపు, సిడం లక్ష్మణ్, వసంత్, దేవదాస్, కడప మాధవరావు, బట్టు సతీష్, రవి, భీంరావు, సిడం లక్ష్మణ్ పాల్గొన్నారు.

గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామాలలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని యేందా గ్రామంలో పర్యటించి, బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి పర్చడమే తన లక్ష్యమని అన్నారు. గ్రామాల్లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాత్రి వేళలో గ్రామాలో పర్యటిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటున్నానని ఎమ్మెల్యే తెలియజేశారు. గ్రామస్తులు గ్రామంలో సీసీ రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యేను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తానన్నారు. ఏ సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తానాజీ, కాంగ్రెస్ నాయకులు పోశక్క, భారత్, రాములు, దశరథ్, ఆత్రం భీంరావ్, సిద్ధార్థ, ప్రకాష్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రుల పాత్ర కీలకం



నవతెలంగాణ-జైనథ్

విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రధానోపాధ్యాయులు శరత్‌కుమార్ యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల జామినిలో ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంట్లో ప్రశాంతమైన, సంతోషకరమైన వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలని అన్నారు. ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని పిల్లలకు అందించాలని సూచించారు. విద్యార్థులను ఎప్పటికి ఇతరులతో పోల్చవద్దని అన్నారు. ప్రతి నెల మూడో శనివారం పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం ఉంటుందని తప్పకుండా ఆ రోజు రావాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ దేవుబాయి, ఉపాధ్యాయురాలు జయశ్రీ, జ్యోతి, అనసూయ, ఉపాధ్యాయులు లక్ష్మణ్, గంగన్న, పెంటపర్తి ఊశన్న, మూనహిద్, పొచ్చిరాం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన ఏడుమేకల చిన్న రాజేశ్వర్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న బాధితకుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్, రమేష్, మల్లేష్, సంటెన్న, స్వామి, వినోద్ ఉన్నారు.

శ్రీహరిరావుని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మెన్‌లు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మెన్ లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాదిలు శనివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గజమాలతో సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్‌లుగా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణచాంద మండలాధ్యక్షులు ఓడ్నల రాజేశ్వర్, కొట్టే శేఖర్, సారంగాపూర్ మాజీ జెడ్పీటీసీ రొడ్డ మారుతీ, చించోలి మాజీ ఎంపీటీసీ వెంకట రమణరెడ్డి, కొలిపాక భీమన్న ఉన్నారు.

పండగ వేళ.. ఆశ్రమాలు ఖాళీ..

- సగానికి తగ్గిన విద్యార్థులు సంఖ్య
- లోపిస్తున్న పర్యవేక్షణ
- విద్యార్థుల కోసం ఉపాధ్యాయుల ఇంటిబాట



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీలోని గిరిజన విద్యార్థులకు ఉచిత భోజన వసతితో పాటు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశముతో ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ఆశ్రమ పాఠశాలలను నెలకొల్పింది. ఈ ఆశ్రమాల్లో చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులు ప్రతి ఏటా పొలాల, దసరా పండగకు ఇంటిబాట పట్టడం సహజం. కాని పండుగలు అయిన తరువాత సైతం సదరు విద్యార్థులు వారం రోజుల పాటు ఆశ్రమ పాఠశాలలో తిరిగి రాక పోవడంతో వారి విద్యాబుద్దులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దానిలో భాగంగానే ప్రభుత్వం వివిధ పాఠశాలకు అక్టోబర్ 2 నుంచి 13 తేది వరకు దసరా సెలవులను ప్రకటించింది. ఈనెల 14న ఆశ్రమ పాఠశాలలు పున: ప్రారంభించారు. ఆశ్రమ పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు సమీపిస్తున్న ఇంకను సగం మంది విద్యార్థులు సైతం హాజరు కాక పోవడం గమనార్హం. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం వివిధ గ్రామాల్లోకి వెళ్లి, విద్యార్థులకు రప్పించే ప్రయత్నంలో ఉన్నారు. శనివారం ఇంద్రవెల్లి మండలంలోని ఆశ్రమ పాఠశాలలో హాజరు శాతం ఈ విధంగా ఉంది. ఆశ్రమ పాఠశాల ఇంద్రవెల్లి బాలికలు 10వ తరగతిలో మొత్తం సంఖ్య 67లో 31మంది, 9లో 71లో 21మంది, 8లో 86కు 14 మంది, 7లో 74కు 12 మంది, 6లో 94కు 12మంది, 5లో 80కి 3మంది, 4లో 50కి 7 గురు హాజరయ్యారు. ఈ ఆశ్రమ పాఠశాలలో మొత్తం 530 మంది విద్యార్థులకు గాను, కేవలం 100 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. ఆశ్రమ పాఠశాల వడగావ్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 330 మందికి గాను, 50 మంది విద్యార్థులున్నారు. అదేవిధంగా కేస్లాపూర్ ఆశ్రమ పాఠశాల బాలికలలో మొత్తం 506 విద్యార్థులకు గాను, 101 మంది విద్యార్థినులు హాజరయ్యారని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఆదివారంలోపు, సోమవారం వరకు అందరూ విద్యార్థులు హాజరవుతారని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఐతే ప్రతి ఏటా పండుగలకు ఇంటి బాట పట్టిన విద్యార్థులు సకాలంలో హాజరుకాక పోవడంతో వారి చదువుపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా 10వ తరగతి చదువే విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటోంది. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు విద్యార్థులు హాజరయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఏటీడబ్ల్యూఓ క్రాంతి కుమార్‌ను నవతెలంగాణ ఫోన్‌లో సంప్రదించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

ప్రసూతి మరణాలు తగ్గించేందుకు చర్యలు



నవతెలంగాణ-నిర్మల్

ప్రసూతి మరణాలు తగ్గించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యారోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రసూతి మరణాలు తగ్గించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన ప్రసూతి మరణాలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తూ రక్తహీనత, పోషకాహార లోపాలను గుర్తించి, అవసరమైన వారికి ఐరన్, కాల్షియం మాత్రలు అందించాలన్నారు. పోషకాహారం పట్ల గర్భిణుల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ టీచర్లతో గర్భిణులకు మానసిక ఆరోగ్యంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ కేసులు ఉన్న గర్భిణులను గుర్తించి అవసరమైన చికిత్సను అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ఆస్పత్రుల వద్ద కట్టుదిట్టమైన భద్రతను కొనసాగించాలన్నారు. ఆస్పత్రుల్లో సీసీ కెమెరా నిఘాలో పర్యవేక్షించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిరంతరం నియంత్రణ చర్యలు కొనసాగించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన డెంగ్యూ, ఇతర జ్వరాలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి రాజేందర్, వైద్యాధికారులు సురేష్, సౌమ్య, వైద్యులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

- పలు అభివృద్ధి పనులకు భూమిపూజ.
- కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కుభీర్

నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రం నుంచి మహారాష్ట్ర సరిహద్దు అయిన తొటంబ తండా వరకు రూ.4కోట్ల 50లక్షలతో పంచాయతిరాజ్ నిధుల కింద మంజూరైన రహదారి నిర్మాణ పనులకు మండల నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ 120 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాలాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. దీంతో ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం, మంచి నీటి వ్యవస్థతో పాటు ముఖ్యంగా విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటానని అన్నారు. అదే విధంగా గ్రామంలో ఉన్న సమస్యలను పరిశీలించి, దశల వారిగా పరిష్కరిస్తామని అన్నారు. అదే విధంగా రహదారి పనులను త్వరగా ప్రారంభించి, నాణ్యతతో పనులు చేపట్టేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సోము, ఎంపీడీఓ నవనీత్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు ఏశాల దత్తాత్రి, సౌంలి రమేష్, నగేష్, మోహన్, గంగా శేఖర్, గులాబ్ నాయక్, రాథోడ్ శంకర్, మండల అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

- కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని రోల్‌మామడ గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.5లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు పలు సమస్యలు ఆయన విన్నవించారు. తమకు కూర్చోడానికి బెంచీలు లేవని విన్నవించారు. స్పందించిన ఆయన తన సొంత డబ్బుతో 10 బెంచీలు పంపిస్తానని అన్నారు. ఆయన వెంట బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బొడ్డు గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రఫుల్ చందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి. సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, తోడసం శంకర్, యాదవరావు, కపిల్, షేక్, అబూద్, గాజుల పోతన్న, గడ్డం నారాయణ, రాజశేఖర్ ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని చాందా(టి) గ్రామంలో శనివారం శివాలయం షెడ్ నిర్మాణానికి రూ.3లక్షలు, కమ్యూనిటీ హాల్ కొరకు రూ.5లక్షలు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఆదిలాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క, కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాప్డే పోచిరాం, కమ్మరి సుదర్శన్, తుడుం రమేష్, కప్డే సురేందర్, లాడే గణపతి, సుభాష్, గణపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కుమురంభీం విగ్రహా ఆవిష్కరణ

ఇంద్రవెల్లి : మండలంలోని హీరాపూర్ గ్రామంలో నేడు కుమురంభీం విగ్రహావిష్కరణ చేయనున్నట్టు తుడుందెబ్బ నాయకులు గేడం భారత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దళారులను నమ్మి మోసపోవొద్దు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మీ
- సోయ కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నార్నూర్

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు అమ్మి లాభం పొందాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కనక మోతుబాయి, మాజీ వైఎస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ప్యాక్స్ ఇన్‌ఛార్జి చైర్మెన్ ఆడే సురేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావ్, మాజీ సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తోడసం నాగోరావ్, సీఈఓ ఆడే గణేష్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖాసీం, మడావి మాన్కు, మాజీ సర్పంచులు రాథోడ్ విష్ణు, రూప్‌దేవ్, పార్టీ కార్యకర్తలు రాథోడ్ దేవుకాబాయి, ఆడే సునితాబాయి, ఫేరోజ్‌ఖాన్, లోకండే చంద్ర శేఖర్, సుల్తాన్, బాబాఖాన్, రాథోడ్ రమేష్, ఆడే శ్రీరామ్, రాథోడ్ శివాజీ, షేక్ మసుద్, ముంతాజ్ ఉన్నారు.

కుంరం సూరు వర్ధంతి సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 25న మండలంలోని కోలాంగూడ, దంతనపల్లి గ్రామంలో నిర్వహించే కుంరం సూరు వర్ధంతి సభని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో వర్ధంతికి సంబంధించిన కరపత్రాలను నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా కుంరం సూరు వీరోచితంగా పోరాటం చేశారని పేర్కొన్నారు. ఆ మహనీయుడి వర్ధంతి సభకు ఆదివాసులు, మేధావులు, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుంరం సూరు వర్ధంతి సభ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్‌లో బ్యాట్‌మెంటన్ కోర్టు నిర్మాణం చేయిస్తానని ఎమ్మెల్యే శనివారం హామీ ఇవ్వడంతో ఉట్నూర్ బ్యాట్‌మెంటన్ క్రీడ తరుపున శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అజయ్ పవార్, జాదవ్ రాజ్ కుమార్, ప్రవీణ్, జాదవ్ సునీల్, జాదవ్ నిరూప్ నాయక్, రాజు, బానోత్ రామ్ కుమార్, రాథోడ్ శ్రీధర్, రవీందర్, శ్యామ్, తిరుపతి, విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా కుమురంభీం వర్ధంతి

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో కుమురంభీం వర్ధంతిని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించి, కుమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయిసెంటర్ సార్మేడి ఆత్రం గంగారాం, పెరుమాండ్ల గంగాధర్, తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షులు తొడసం శంకర్, తుడుం దెబ్బ మండలాధ్యక్షులు జుగ్నక్ సంబన్న, వివిధ గ్రామాల పటేళ్లు, దేవరీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు కొట్నాక్ కోటేష్, కుమురం జంగు, కనక గణేష్, ఆత్రం లక్ష్మణ్, దుర్వ రాజు, ఉయిక మారుతీ, ఆత్రం సోనేరావు పాల్గొన్నారు.

పశువుల్లోని వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

పశువులు వ్యాధుల బారిన పడకుండా, ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మండల పశు వైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని సాథ్‌నెంబర్ గ్రామంలో ఉచిత సామూహిక గాలికుంటూ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను 280 పశువులకు వేసినట్లు తెలిపారు. అందులో 110 ఆవులు, 90 గేదెలు, 80 ఎడ్లలకు వేశామన్నారు. పశు యజమానులు ముందస్తుగా ఉచిత గాలికుంటు టీకాలను వేయించడం ద్వారా పశువులకు గాలికుంటు వ్యాధి సోకాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకురాలు సంధ్య, వైద్య సిబ్బంది శేఖర్, శ్రీను, పశు యజమానులు పాల్గొన్నారు.

కవి వెంకట్‌కు సిరిమాను సాహితీ ప్రశంసా పత్రం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

కవి వెంకట్‌కు సిరిమాను సాహితీ అంతర్జాతీయ ప్రశంసా పత్రాన్ని ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. సిరిమాను కవితోత్సవాల సందర్భంగా వాట్సప్ వేదికద్వారా 17, 18, 19వ తేదీలలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిమాను కవితోత్సవాలలో ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమీ తొలి అధ్యక్షులు, కళారత్న పొట్లూరి హరికృష్ణ, నిర్వాహకులు లహరి, ఉమామహేశ్వరీలు సంస్కృతభాషా ప్రచార సమితి, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రముఖ వ్యాఖ్యాత, పద్యకవి బి.వెంకట్‌కు అందించారు. ఈ పలువురు కవులు ఆయనను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

దండారి ఫొటోగ్రఫీ వాల్‌పోస్టర్‌ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసుల సంస్కృతిని ప్రతిబింబించే దండారి ఉత్సవాన్ని పురస్కరించుకుని బోలి చేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం దండారి ఫోటో ప్రాజెక్టు పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని యువత దండారి ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుపొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోలి చేతో ఫౌండేషన్ బోర్డ్ మెంబర్స్ ఆత్రం మోతీరామ్, సిడాం కిరణ్, సిడాం వరప్రసాద్, కొలాం సేవా సంఘం నాయుకులు టేకం వసంత్‌రావ్, ముకుంద్‌రావ్ పటేల్ ఉన్నారు.

పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈ నెల 21 పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని ఎస్సైలు, ఏఎస్సైలు, ఇతర సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ కేశవులు మాట్లాడుతూ కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ స్థాయి వరకు సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగుపరచడంలో నా పాత్ర అనే అంశంపై, ఎస్సై నుండి ఆ పై స్థాయి అధికారులకు ధృఢమైన శరీరంలో ధృఢమైన మనసు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోలీస్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 26 మంది పాల్గొన్నారని వీరిలో ఉత్తములకు బహుమతుల ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి- చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధర్వంలో ప్రతి మంగవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షల సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ కోరారు. పరీక్షల్లో ఎంపికైన క్యటరక్ట్ రోగులు 13 మందికి ఆపరేషన్ కోసం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి డా.కొత్తపల్లి శ్రీనివాస్, డా.కొత్తపల్లి అనిత పంపించారు. అనంతరం డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలలో వేల మందికి ఆపరేషన్ చేయించామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆపరేషన్ చేయించికొని లబ్ధి పొందిన వారు మరి కొంతమందినీ ప్రోత్సహించాలని సూచించారు. ఇందులో ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి, కిమ్స్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భీం వర్ధంతి వారోత్సవాలను విజయవంతం చేయాలి

- ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్



నవతెలంగాణ-కెరమెరి

కుమురం భీం 84వ వర్ధంతి వారోత్సవాలను విజయవంతం చేయాలని భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందు రాజేశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివాసీ సంఘ నాయకులతో కలిసి మాట్లాడారు. ఈనెల 24న మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో కుమురం భీం 84వ వర్ధంతి వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వర్ధంతి వారోత్సవాల్లో పటేల్, దేవరి, గ్రామ పెద్దలు, యువకులు, విద్యావంతులు ఇతర సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజ్ గోండ్ సేవా సమితి మండల అధ్యక్షులు మడవి రఘునాథ్, సీనియర్ నాయకులు సిడాం జగన్నాథ్ రావ్, కుమురం సూరు ఉత్సవ కమిటీ కన్వీనర్ ఆత్రం మారుతి, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్, తుడుందెబ్బ నాయకులు కనక ప్రభాకర్, కుమురం భీంరావ్ పాల్గొన్నారు.

లాటరీ నిర్వహిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అనుమతి లేకుండా లాటరీ నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులపైన కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఆదిలాబాద్ క్రాస్ రోడ్ వద్ద నలుగురు వ్యక్తులు లాటరీ టికెట్ అమ్ముతూ పోలీస్‌లకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారని, జెండాగూడ యూత్ బులాయి అనే పేరుతో లాట్ లాటరీ టికెట్లు ముద్రించి ప్రతి టికెట్‌ని రూ.వంద చొప్పున అమ్ముతున్నారని, వీరు లాటరీ ద్వారా యాక్టివా స్కూటీ, 32 ఇంచుల స్మార్ట్ టీవీ బహుమతి కలదని ఫ్లెక్సీ ద్వారా ప్రచారం చేస్తూ ప్రతి టికెట్‌పై రూ.వంద కలెక్ట్ చేస్తున్నారని తెలిపారు. దీనికి గాను దుర్గం బాబురావు, దుర్గం నాందేవ్, దుర్గం శ్రీనివాస్, దుర్గం కోటేశ్వర్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఆర్మీ జవాన్‌కు ఘనసన్మానం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఆర్మీ ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థి వాడై శ్రీరామ్‌ను అధ్యాపకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం చంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఇండియన్ ఆర్మీలో జవాన్ ఉద్యోగం సాధించి శిక్షణ పూర్తిచేసుకొని ప్రస్తుతం ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడన్నారు. భరతమాత సేవలో దేశరక్షణలో మన కళాశాల విద్యార్థి శ్రీరామ్ పాల్గొనడం అభినందనీయమని, శ్రీరామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురేందర్‌కుమార్, సంతోష్, శ్రీధర్, కిరణ్‌కుమార్, తిరుపతి, సత్యం, సంతోష్, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీశ్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారి ప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొని కళాశాల ఆవరణ పిల్లలతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థి దశ నుండి అవగాహన పెంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-కెరమెరి

గత నెలలో 21న 'ప్రమాదకరంగా అంగన్‌వాడీ కేంద్రం' అనే శీర్షికన నవ తెలంగాణలో ప్రచురితమైంది. కథనం ప్రచురితమైన మరుసటి రోజే ఐటీడీఏ అధికారులు శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. మరమ్మతుల కోసంపై అధికారులకు నివేదిక పంపించారు. దీంతో మరమ్మతులకు నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రం పైకప్పును తొలగించి మరమ్మత్తు పనులు చురుగ్గ చేపడుతున్నారు. దీంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎల్ఆర్ఎస్ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం కాగజ్‌నగర్ మండలంలోని ఎన్‌జీఓఎస్ కాలనీ, గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్-2020 పథకంలో అనుమతి లేని లే-అవుట్ల క్రమబద్దీకరణకు అందిన దరఖాస్తులను రికార్డులు సరి చూసి భౌగోళిక స్థితిని పరిశీలించి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నిషేధిత, ప్రభుత్వ భూములు, చెరువు శిఖం, వాగుల సంబంధిత భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్ళినప్పుడు దరఖాస్తుదారుడికి సమాచారం అందించి దరఖాస్తు సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించాలని సూచించారు. సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రికార్డు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, ఆయా శాఖల అధికారులున్నారు.

డబుల్ బెడ్ రూమ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

పేద ప్రజలకు గూడు కల్పించాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వం గూడు కల్పించాలని ఉద్దేశ్యంతో డబుల్ బెడ్ రూమ్ పథకం ద్వారా నివాసం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో డబుల్ బెడ్ రూమ్ సంబంధిత ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ ఇంజనీర్ రమాదేవి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-దహెగాం

ప్రాథమిక సహకార సంఘం వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం రోజున ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దండె వెంకటేష్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోగేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించిన వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి దళిత సామాజికవర్గానికి చెందిన కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్యను ఆహ్వానించకుండా ప్రారంభించడం సరికాదన్నారు. ఈ ప్రారంభోత్సవానికి హాజరైన సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రోటోకాల్‌పై అవగాహన లేదా అని ప్రశ్నించారు. ప్రోటోకాల్ పాటించకుండా దళిత సామాజిక వర్గానికి చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్‌ను అవమానించిన దహెగాం పీఏసీఎస్ పాలకవర్గంపై వెంటనే చట్టరీత్య చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆయిల్ల శంకర్, నాయకులు రాంటెంకి సురేష్, గొట్ల మల్లేష్, ముడిమడుగుల తిరుపతి, తోగం అశోక్ పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సు పాత్ర కీలకం : ఇన్‌చార్జి డీఈఓ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ప్రపంచ పురోగతిలో కృత్రిమ మేధస్సు పాత్ర చాలా కీలకమైందని ఇన్‌చార్జి డీఈఓ ఉదయ్ బాబు అన్నారు. శనివారం మండల ప్రాథమిక పాఠశాల సర్ సిల్క్‌లో కృత్రిమ మేధస్సు సంభావ్యతలు మరియు ఆందోళనలు అనే అంశంపై జిల్లాలోని ఎనిమిదవ నుండి పదవ తరగతి విద్యార్థులకు సైన్స్ సెమినార్ నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు కృత్రిమ మేధా పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ మాట్లాడుతూ కృతిమ మేధస్సుకు మానవత విలువలను నైతిక విలువలను జోడిస్తే ప్రపంచ అభివృద్ధితో కృత్రిమ మేధాపాత్రను నేటి వరకు దేనితోను పోల్చలేమన్నారు. ఈ సందర్భంగా ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులు సర్టిఫికెట్లు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్థిక గణాంకాల అధికారి జాడిదేవాజీ, వాసుల ప్రభాకర్, న్యాయ నిర్ణేతలు సత్యనారాయణ, బిక్షపతి పాల్గొన్నారు.

ఒకే కుటుంబంగా కళా స్ఫూర్తిని చాటాలి



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఉద్యోగ కళాకారులు ప్రాంతాల విబేధం లేకుండా ఒకే కుటుంబంగా కళా స్ఫూర్తిని చాటాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం డబ్ల్యూపీఎస్, జీఏ 91వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన నియర్ బై కల్చరల్ పోటీలను ముఖ్య అతిదిగా హాజరై ఆయన ప్రారంభించారు. జ్యోతి వెలిగించి నటరాజ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ కళాకారులు కోల్ ఇండియా స్థాయిలో రాణించి సింగరేణి సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రాంతాలుగా కాకుండా ఉద్యోగులు అంతా ఒకే కుటుంబంగా కళా స్ఫూర్తిని చాటాలని సూచించారు. మందమర్రి, బెల్లంపల్లి కళాకారుల ప్రతిభను ప్రసంశించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీఓ ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్ పాల్గొన్నారు.

డీఈఈ సెట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో డీఈఈ సెట్ రాసిన విద్యార్థులకు అడ్మిషన్లకు సంబంధించి షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి ఉదయబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21న సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ప్రారంభమవుతుందని, నవంబర్ 4 నాటికి కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఉపాధ్యాయునిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సీఐ సతీష్ తెలిపారు. పట్టణంలోని మజీద్‌వాడ ఏరియాలో పాఠశాలలో ఎస్జీటీ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు జాదవ్ గోవిందరావుపై అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని తండ్రి ఎగురపు విలాస్ దుర్భాషలాడుతూ, భౌతిక దాడికి పాల్పడ్డాడు. ఉపాధ్యాయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బూర్గుడ పాఠశాలలో గొడవ

ఆసిఫాబాద్ : మండలంలోని బూర్గుడ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అభినవను అదే పాఠశాలలో గణితం బోధిస్తున్న ఉపాధ్యాయుడు సంతోష్ కొట్టాడని విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి గొడవకు దిగారు. ఉపాధ్యాయుడు తలపై కొట్టడంతో తమ కుమారునికి చెవుల నుండి రక్తం వస్తుందని, మంచంలో నుండి లేవడం లేదని తెలుపడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కల్పించుకొని విద్యార్థికి చికిత్స అందిస్తామని తెలపడంతో పాటు మంచిర్యాలకు తరలించారు. గతంలో ఇదే ఉపాధ్యాయుని విషయంలో విద్యార్థులు తమకు ఉపాధ్యాయుడు వద్దని రోడ్డు ఎక్కడంతో ఆయనను పదో తరగతికి చెప్పకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం 8వ తరగతి విద్యార్థి విషయంలో కూడా సంఘటన చోటు చేసుకోవడంతో పాఠశాలలో జరిగే అంశాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఆసిఫాబాద్ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆసిఫాబాద్ విద్యుత్ అధికారి సదాశివ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోతకు గురైన రోడ్డు

- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని సాంగ్వి నుంచి నిషాని వెళ్లే మార్గంలో రోడ్డు కోతకు గురైంది. దాదాపు రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు ఇంద్రానగర్ సమీపంలోని కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురికాగా మరికొన్ని చోట్ల రోడ్డు కుంగిపోయింది. దీంతో కెరమెరి నుంచి నిషాని, ఇందపూర్, దేవుడుపల్లి, ఉమ్రి వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడంతో రోజురోజుకు మరింత కోతకు గురవుతొంది. రాత్రి సమయాల్లో ఈ రోడ్డు గుండా ప్రయాణించడం వాహదారులకు కష్టంగా మారింది. నాలుగు చక్రాల వాహనాలు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగితే భారీ స్థాయిలో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉం టుంది. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పునర్వినియోగంపై అవగాహన కలిగించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థి దశ నుండే పునర్వినియోగంపై అవగాహన కలిగించాలని జాతీయ హరితదళ కోఆర్డినేటర్ బాసిక విద్యాసాగర్ అన్నారు. శనివారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సర్ సిల్క్ బ్రాంచ్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థి దశ నుండి విద్యార్థుల్లో పునర్వినియోగంపై అవగాహన కల్పించడానికి జాతీయ హరిత దళం ఇటువంటి ప్రదర్శనలను ఏర్పరుస్తుందని తెలిపారు. విద్యార్థులు చాలా అర్థవంతమైన ప్రాజెక్టులను రూపొందించారని, ఈ సందర్భంగా వారికి సహకరించిన గైడ్ టీచర్స్‌ని అభినందించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి ఉదయ్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు వ్యర్థం నుండి అర్థము వచ్చే పనులు చేయించడం వలన కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులకు ప్రథమ బహుమతి కింద రూ.3000, ద్వితీయ బహుమతి రూ.2000, తృతీయ బహుమతి రూ.వెయ్యి నగదుతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధిక గణాంక అధికారి జాడి దేవాజి, మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, జాతీయ హరితదళం జిల్లా కోఆర్డినేటర్ కటకం మధుకర్, పాఠశాల జాతీయ హరిత దళం ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ఎస్సీ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. 45 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు పాఠశాల ఆవరణలో తిరుగుతూ పరిసరాలు అపరిశుభ్రం చేస్తున్నాయన్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహం కూడా శిథిలావస్థకు చేరుకుందని దానిని పునర్నిర్మించి పాఠశాల ప్రహరీ నిర్మిస్తే విద్యార్థులకు మేలు జరగడంతో పాటు గాంధీ విగ్రహం రక్షించబడుతుందన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికునికి గాయాలు

నవతెలంగాణ-రెబ్బెన

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికునికి గాయాలైన ఘటన శనివారం మండలంలోని జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోలేటి గ్రామానికి చెందిన దుర్గం బాపు పని నిమిత్తం ఆసిఫాబాద్ వెళ్తున్న క్రమంలో రెబ్బెన మండలంలో ఇంద్రనగర్ జాతీయ రహదారిపై తన ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతనిని 108 వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పశు సంపదను పెంపొందించాలి

నవతెలంగాణ-తిర్యాణి

గ్రామీణ ప్రాంతాల్లో పశు పోషణ నానాటికి తగ్గుతున్న క్రమంలో పశువుల పెంపకం చేపట్టాల్సిన అవసరముందని పశువైద్యాధికారి సాగర్ అన్నారు. శనివారం అరటి పల్లి, ఏదులపాడు, డోర్ల తదితర గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. రైతులు పశువులను సంరక్షించాలని, పశువుల ఎరువులతో పంటలను పండిస్తే అనారోగ్య సమస్యల బారి నుండి ఉపశమనం లభిస్తుందని, పశువుల ఎరువులను పిచికారి చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలిపారు. పట్టణ ప్రాంతాలతో పాటు పల్లెల్లో సైతం పశువుల పెంపకం తగ్గించడం వల్ల రైతులు కూడా పాల ప్యాకెట్లు వాడడం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సంతోష్, రాకేష్, మనోహర్, సురేష్, రైతులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పెరిగిన నిత్యావసర వస్తువులు ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యులు చటరే భీంరావ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు అందని ద్రాక్షలా విద్య మారిందన్నారు. విద్యారంగాన్ని, వసతి గృహాలను రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు గాలికొదిలేసాయని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో రానున్న రోజుల్లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | అక్టోబర్ 20, 2024 | www.navatelangana.com

పాఠశాలకు ఉచిత విద్యా సామాగ్రి అందజేత

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని తంగళపల్లికి చెందిన చల్లూరి ఆనంద్ ప్రత్యేక చొరవతో హెల్పింగ్ సొసైటీ పౌండేషన్ సహకారంలో తంగళ్ళపల్లి అశోక్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఉచిత నోట్ పుస్తకాలు, పెన్సిళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు సుశీల్ కూమర్ అఫ్జల్ పాషా మాట్లాడుతూ రిసైక్లింగ్ ద్వారా ఆయారు చేసిన నోట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోని, చదువు లోఉత్పతంగా రాణించాలని కోరారు. కార్యక్రమరా తాండూర్ మండల విద్యాధికాకి మల్లేశం, తాండూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాములు శ్రీనివాస్ సొసైటి సభ్యులతో పాటు గోమాస ఆరుపతి, శ్రీరాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు తల్లితండ్రుల ప్రొత్సాహం ఉండాలి

నవతెలంగాణ-జైపూర్



తరగతి గదుల్లో విద్యాభ్యాసం కొనసాగిస్తున్న విద్యార్థులకు తల్లితండ్రులు ప్రొత్సాహం ఉండాలని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు అలీస్ మాదుర్య అన్నారు. పాఠశాల విద్యార్థులతో శనివారం సమావేశమైన ఆమె ఇంటి వద్ద చదువు కొనసాగించుటకు అవకాశం కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి వివరించి విద్యార్థులతో ఉత్తమ ప్రాజెక్టుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన అపార్ క్రమ సంఖ్య కోసం తల్లితండ్రుల నుంచి సమ్మతి పత్రాలు స్వీకరించారు. ఈ సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునిత పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే పారిశుధ్యం మెరుగు

● మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణ ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరిస్తేనే పట్టణంలో పారిశుధ్యం మెరుగు పడుతుందని మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ అన్నారు. రోజు వారి సందర్శనలో భాగంగా ఆయన శనివారం పట్టణంలోని పలు వార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తను ఇంటి పరిసరాలలో వేయకూడా మున్సిపల్ చెత్త బండిలో వేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రజల ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డ్ ఆఫీసర్ మానస, మున్సిపల్ సబ్బంది శేఖర్ పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

నవతెలంగాణ-జన్నారం

మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం అన్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం సరఫరా చేసిన బతుకమ్మ చీరలను గ్రామంలోని మహిళలకు ఆయన పంపిణీ చేశారు. మహిళల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని మహిళలు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళోత్సవ పోటీలకు ఎంపికైన విద్యార్థి

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించేందుకు విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించిన కళోత్సవంలో జిల్లాస్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో స్లేట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. తొమ్మిదో తరగతి గాజుల సహస్రగౌడ్ జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించింది. జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిన ఆమె నవంబర్ 1న రాష్ట్రస్థాయిలో పాల్గొననుంది. ఆ విద్యార్థినిని ఆ పాఠశాల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రజితారెడ్డి, ప్రిన్సిపల్ శిరీన్‌ఖాన్, డాన్స్ మాస్టర్ నర్మదా, సుధా, కృష్ణ ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంటర్నల్ ఆడిట్ ఫిట్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్

ఇంటర్నల్ ఆడిట్ ఫిట్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా తెలిపారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ డివిజన్ ఇంటర్నల్ ఆడిట్ ఫిట్ కమిటీ సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫిట్ కార్యదర్శిగా గడ్డల రాజు, సహాయ కార్యదర్శిగా దాసరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శిగా సామల నరేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొట్ల మల్లేష్, పోతూరి మౌనిక, కార్యవర్గ సభ్యులుగా హరి, కటకం రమేష్, రావుల ప్రియాంక, గిల్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



నవతెలంగాణ-తాండూర్

యువత అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం బెల్లంపల్లి కొత్త బస్టాండ్ చౌరస్తాలో ఏపూరి ఎర్ర సూర్యుడు మాజీ శాసనసభ్యుడు మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతిని నిర్వహించారు. ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయకార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ మద్దికాయల ఓంకార్ సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ మండలం ఏపూరి గ్రామంలో పుట్టి చిన్నతనంలోనే కమ్యూనిస్టు భావాలను కలిగి సుందరయ్య బాటను ఎంచుకున్నాడని తెలిపారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఐదుసార్లు ఏకతాటిగా గెలిచి ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచి పోయారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన వర్ధంతిని ఈ నెల 17 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి రమేష్, సతీష్, తొగరి రాహుల్, అరుణ్, రాజు, శ్రీను, మంజిత్ పాల్గొన్నారు.

'ఆధ్యాత్మికతతో ప్రశాంతత లభిస్తుంది'

నవతెలంగాణ-జన్నారం

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని చింతగూడ గ్రామ శివారులో ఉన్న పవిత్ర గోదావరి నది ఒడ్డున వెలసిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని ఆయన సూచించారు. అమ్మవారి ఆశీస్సులు మండల ప్రజలపై ఉండాలని మొక్కుకున్నట్టు తెలిపారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, నాయకులు బీవీఎస్ నాయక్, నోముల రాజు పటేల్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-జన్నారం



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శనివారం మండలంలోని మురిమడుగు గ్రామంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశాన్ని ఒడిపెల్లి ప్రమీల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజా సంక్షేమం కోసం అనేక హామీలను ఇచ్చాయని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి నెలలు గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. పైగా ప్రజల్లో వస్తున్న అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి బీజేపీ మతోన్మాద చర్యలకు పాల్పడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో నాటకాలు ఆడుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాబోవు కాలంలో ఆ ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తునా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్, మండల నాయకులు కొండ గొర్ల లింగన్న, కూకటికారి బుచ్చన్న, ఆత్రం రాజు, దాసండ్ల రాజన్న, అంబటి లక్ష్మణ్, ఎస్‌కే అబ్దుల్లా పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలి



నవతెలంగాణ-తాండూర్

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. శనివారం మండలంలోని అచలాపూర్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా స్థాయి అండర్-17(బాలికల) కబడ్డీ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తాండూర్ సిఐ కుమారస్వామి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ మల్లేశం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామచంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యత పెంచుకున్న విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రభుత్వం రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తుందని తెలిపారు. క్రీడల వల్ల మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో నైపుణ్యతను పెంచుకోవాలని సూచించారు. అచలాపూర్ పాఠశాల బాలికలు కుస్తీ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం పురోగా అభివృద్ధి చెందుతుందన్నారు. పోటీలలో మంచిర్యాల జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 70 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని అచ్చులాపూర్ పీఈటీ సాంబమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి గాజుల శ్రీనివాస్ అబ్జర్వర్‌గా కె రామ్మోహన్ రావు, సీనియర్ పీడీ యాకూబ్, వహీదా పీడీలు, పీఈటీలు కె రవీంద్ర, రాజేష్, పున్నం, కవిత, శేఖర్ ఉమా పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీతోనే కార్మిక హక్కుల పరిరక్షణ సాధ్యం

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి మనుగడ, కార్మికుల హక్కుల పరిరక్షణ ఐఎన్టీయూసీతోనే సాధ్యమవుతుందని బ్రాంచ్ సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ఫిట్ కార్యదర్శి జాన్సన్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థను భవిష్యత్ తరాలకు అందించాలంటే మెటల్ మైనింగ్ విద్యుత్, సిమెంట్, సాఫ్ట్‌వేర్ రంగాలకు విస్తరింపజేయాలని, అలాగే కార్మికుల సొంతింటి కల, పెర్క్స్ పై ఇన్‌కమ్ టాక్స్ రద్దు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఐఎన్టీయూసీ నాయకులకి కార్మికుల్లో పెరుగుతున్న ఆదరణను ఓర్వలేని కొంతమంది వ్యక్తులు సంఘాలు లేని పోని విమర్శలు చేస్తున్నాయన్నారు. అనంతరం స్థానిక సమస్యలపై గని మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కలవేన శ్యామ్, గరిగె స్వామి, భీంరావు, తిరుపతి రాజు, కాల్వ శ్రీనివాస్, నీలం సదయ్య చంద్రమోహన్, వెంకట స్వామి, జగన్, రమేష్, ఇండ్ల కిరణ్, జీవన్ రావు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదు



నవతెలంగాణ-జైపూర్

గొల్లవాగు ప్రాజెక్టు సమీపంలోగల ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయని నీటి పారుదల శాఖ వర్క్ ఇన్స్‌పెక్టర్ తువ్వకుమార్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ తవ్వకాలతో ప్రాజెక్టు కట్టకు ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. ప్రాజెక్టు కట్ట వద్ద జేసీబీతో డ్రైవర్ అంగూరి సతీష్ మట్టి తవ్వుతున్నట్లు గుర్తించామని తెలిపారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిలో ట్రాక్టర్ యజమాని డ్రైవర్ బోగె స్వామి, అదేవిధంగా కాల్వ నరేష్, అనపర్తి మధూకర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లుగా అమరగాని గణేష్, ఆకుదారి మహేష్‌లు ట్రాక్టర్ల ద్వార మట్టి తరలిస్తున్నట్లు పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా చొరబడి ప్రాజెక్టు కట్టకు ప్రమాదం ఏర్పడేవిధంగా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రూప్-1 అభ్యర్థులపై దాడి దుర్మార్గమైన చర్య

నవతెలంగాణ-తాండూర్

గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసుల దాడి దుర్మార్గమైన చర్యల అని తెలంగాణ నిరుద్యోగ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనను పరిగణనలోకి తీసుకొని గ్రూప్-1 వాయిదా వేసి జీఓ నంబర్ 29 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 29 ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందని అన్నారు. నిరుద్యోగులపై గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జి దారుణమని అరెస్టు చేసిన విద్యార్థులను గ్రూప్-1 అభ్యర్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి తేటతెల్లమైందని అన్నారు. హైదరాబాద్‌లోని అశోక్ నగర్ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు విద్యార్థులపై నిరుద్యోగులపై పోలీసులు చేసిన దాడికి రాష్ట్ర ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించని పక్షంలో విద్యార్థులు నిరుద్యోగులతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

త్వరితగతిన బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేయాలి

● ఎంపీఓ శ్రీపతి బాపురావు

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేస్తున్న నర్సరీల నిర్వాహణకు సంబంధించి బ్యాగ్ ఫిల్లింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు సూచించారు. శనివారం ముదిగుంట, మిట్టపల్లి, కానుకూరు గ్రామ పంచాయతీలను సంధర్శించిన ఆయన నర్సరీలను సందర్శించారు. వంద శాతం మొలక వచ్చే విదంగా చూడాలని ఆదేశించారు.



పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-జన్నారం

తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కలమడుగు గ్రామంలో చోటుచేసుకుంది. అదరపు ఎస్ఐ తానాజీ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లాలోని దస్తురాబాద్ మండల్ మున్యాల గ్రామానికి చెందిన, వేము నూరి రాజేశం(27) వడ్రంగి పని చేసుకుంటూ అందరి దగ్గర డబ్బులు తెచ్చుకొని విచ్చలవిడిగా మందు తాగుతూ, బలాదురుగా తిరిగేవాడు. డబ్బులు ఇచ్చినవారు ఇంటికి వచ్చి తల్లిని నిలదీయడంతో అది గ్రహించిన రాజేశం మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. తీరా చూస్తే మండలంలోని కలమడుగు గోదావరి రేవు ఒడ్డున పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

ఐకేపీ ఆధ్వర్యంలో చీరల పంపిణీ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని జెండా వెంకటపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తలమలలోని గ్రామ మహిళలకు ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, ఐకేపీ సీసీ సుమలత, సీఏ మల్లేష్, మొగిళి, కాంగ్రెస్ నాయకులు వెల్తపు రాము, భారతి, ఇండ్ల చిన్నయ్య, నస్పూరి శ్రీనివాస్, సత్తయ్య, మామిండ్ల సత్తయ్య, శ్రీనివాస్, మల్లేష్, తిరుపతి పాల్గొన్నారు.

ఐటీఐలో 7వ విడత అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్లకు 7వ విడత అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 30వ తేది వరకు ఐటీఐ. తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. 5 విడతలలో నమోదు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ నమోదు చేయవలసిన అవసరం లేదని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్లికేషన్ ప్రింటెడ్ కాపీతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో శ్రీరాంపూర్ ప్రభుత్వ ఐటీఐ అడ్మిషన్స్ కొరకు హాజరు కావాలన్నారు. వాక్ ఇన్ అడ్మిషన్ అక్టోబర్ 19 నుంచి 30వ తేది మధ్యాహ్నం 3 గంటల వరకు హాజరుకావాలని పేర్కొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..!

నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కాసిపేట సతీష్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెల్సుకున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ శనివారం నర్సింగాపూర్‌లో ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసిన ఎంపీ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి సతీష్ ఆరోగ్యం కుదుటపడేందుకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని కోరారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, వైద్యులు సూచనలు, సలహాల మేరకు నడుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజోద్దీన్, పండుగ రాజన్న, బోయిని సంపత్ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-జైపూర్

పుట్టిన శిశువు వయస్సుకు తగ్గట్టుగా ఎదుగుదల ఉండాలని, పిల్లల ఆరోగ్యానికి అవసరైన జాగ్రత్తలు తీసుకోవాలని కుందారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్రావ్య సూచించారు. మండలంలోని రామారావుపేట్ గ్రామంలోగల అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవితతో కలిసి సంధర్శించారు. ఈ సందర్భంగా పోషకాహార లోపం గల 6 మంది చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించి మెడికల్ స్క్రీనింగ్ టెస్టులు చేశారు. ఈ సందర్భంగా పిల్లల తల్లితండ్రులతో మాట్లాడుతూ బిడ్డల వయస్సుకు తగ్గట్టుగా ఎత్తు బరువు ఉండాలని, ఏదేని లోపం ఉంటే వెంటనే వారికి వైద్య పరిక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్య, హెచ్‌ఓ రాజమ్మ, అంగన్‌వాడీ టీచర్ విజయ, జ్యోతి, అంజలి, సరిత పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

● పత్తి, వరి పంటలు తీవ్ర నష్టం

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పత్తి, వరి పంటలు చేతికి వచ్చిన సమయంలో ఈ అకాల వర్షంతో రైతులకు తీవ్రంగా నష్టపోతారని పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పత్తి పంట మొదటి దఫా ఏరే సమయం కావడంతో చేనులో వున్న పత్తి వర్షానికి తడిసి పోయింది. వరి పంట ఈనే దశలో వుండడంతో పూత రాలడమే కాకుండా పైరు నేల వాలింది.

సీసీ రోడ్లు, సైడ్ డ్రేన్‌ల నిర్మాణ పనులకు భూమి పూజ



నవతెలంగాణ-మందమర్రి

మున్సిపాలిటీలోని సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి భూమి పూజ చేశారు. శనివారం సెవెన్ హిల్స్ స్కూల్ నుంచి శ్రీ కృష్ణ ఫంక్షన్ హాల్ మీదుగా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.78 లక్షలు, రూ.61.20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ, సైడ్ డ్రెన్‌ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. భాగ్యనగర్ కాలనీలో రూ.30.5 లక్షల సెప్టిక్ ట్యాంక్ పైప్‌లైన్, మేదరి బస్తీ, ఇందిరానగర్ రూ.10.80లక్షల సీసీ రోడ్డు, మార్కెట్ ఏరియా వద్ద రూ.6.90 లక్షల సీసీ డ్రైన్ సిటీ కేబుల్ లైన్, విద్యానగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏరియాలో రూ.7.50.లక్షల సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్

ఉచిత న్యాయ సలహాకు టోల్ ఫ్రీ నెంబర్ విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆర్థికంగా స్తోమత లేనివారి కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన ఉచిత న్యాయసలహ టోల్ ఫ్రీ నెంబర్లు 15100ను జిల్లా జడ్జీ ఎంపీ రమేష్, కలెక్టర్ వెంకటేష్ ధోత్రేలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు కోర్టులో ఉచిత న్యాయ సాయం పొందడానికి ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్‌ను జాతీయ న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు, దీనిని అర్జీదారులు ఉపయోగించుకోవాలని సూచించారు. అంతకుముందు సీనియర్ సివిల్ జడ్జి యువరాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి సారిక పాల్గొన్నారు.

నూతన డీఈఈ సన్మానం

నవతెలంగాణ-నేరడిగొండ



నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఈఈ టీడబ్ల్యూ సతీష్, ఏఈ శేఖర్‌ని శనివారం గిరిజన లంబాడి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ కలిసి పుష్పగుచ్చాలు అందించారు. శాలువతో సత్కరించి స్వాగతించారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడంలో బిల్లులను విడుదల చేయాలని, ఐటీడీఏ ద్వారా గిరిజన తండాలు, గూడాలలో నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఎండీఎం కార్మికులకు మెనూ ఛార్జీలు పెంచాలి



నవతెలంగాణ-దహెగాం

మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులకు మెనూ చార్జీలు పెంచాలని మధ్యాహ్న భోజనపథకం యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఆర్ సీ కార్యాలయంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఐఎస్ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు నెలనెలా చెల్లించాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు, గుడ్ల బిల్లులు విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి మెనూఫెస్టోలో ప్రకటించినా రూ.10,000 వేతనం వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమత, ఎల్కారి పార్వతీ, గురిజాల లక్ష్మీ భీమొజు శ్రీలత పాల్గొన్నారు.

పోహకాహారంపై అవగాహన కల్పించాలి



నవతెలంగాణ-వాంకిడి

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోహకాహారంపై అవగాహన కల్పించాలని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ సూచించారు. మండలంలోని ఘాట్ జనగాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న వీహెచ్ఎన్‌డీ గ్రామ ఆరోగ్య పోషకాహార దినోత్సవ కార్యకమాన్ని శనివారం ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ సందర్శించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అందుతున్న సేవలు, టీకాలు, కేంద్రంలో అందిస్తున్న పోషకాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు, చిన్నపిల్లలకు సరైన సమయాంలో టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కృష్ణకుమారి, హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, ఏడబ్ల్యూటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ నిమజ్జనం



నవతెలంగాణ ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపలగూడ, కచ్‌కంటి, బంగారుగూడ, రామాయి, న్యూ రాంపూర్, లోకారి, పీప్పలధరి, రాంపూర్, అనుకుంట గ్రామాలతో పాటు మావల మండల కేంద్రంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. డీజే సప్పుడుల మధ్య నృత్యాలు చేసి డప్పు బాజాల మధ్య బతుకమ్మలను నీటిలో విడిచిపెట్టారు. అనంతరం సద్దులు ఆరించి సమీపంలో చెరువులో నిమజ్జనం చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

నార్నూర్ : మండల కేంద్రంలోని పొచ్చమ్మ వాడలో పదిహేను రోజుల పాటుగా బతుకమ్మ సంబురాలు మహిళలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల బద్దంగా మహిళలు బతుకమ్మ భక్తి పాటలపై నృత్యాలు చేశారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేసినంతనం సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మహిళలు లావణ్య, రవిత, త్రిష, విజ్జు, అంకిత, శ్రావణి, స్పందన, నందీని, లలిత, మహేశ్వరీ, అమృత, దుర్గా, శోభా, చిట్టీ, నందీని ఉన్నారు.

విలీన ప్రకటనకు ఐఎఫ్‌టీయూకు సంబంధం లేదు

నవతెలంగాణ- ఖానాపూర్

టీయూసీఐ సంస్థలో ఐఎఫ్‌టీయూను విలీనం చేస్తున్నట్టు ప్రకటన జారీ చేశారని, ఈ ప్రకటనతో మాతృసంఘమైన ఐఎఫ్‌టీయూకు ఎలాంటి సంబంధం లేదనిఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. శనివారం విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ మౌలిక అవగాహనను సంస్థ రాజకీయ విధానాలను విభేదిస్తూ కొంతమంది ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో బయటికి వెళ్లిన ఒక విభాగం ఐఎఫ్‌టీయూ పేరుతోనే సంస్థను ఏర్పాటు చేసుకొని కొనసాగుతూ విలీనం చేస్తున్నట్టు ప్రకటన చేస్తున్నారని, ఈ ప్రకటన ఐఎఫ్‌టీయూ శ్రేణులను, కార్మికవర్గాన్ని గందరగోళానికి గురి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, డివిజన్ నాయకులు మాలావత్ జేవింద్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో 23 నుంచి పత్తి కొనుగోళ్లు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- క్వింటాల్‌కు రూ.7521



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తి కొనుగోళ్లు ఎప్పుడెప్పుడు జరుగుతాయా అని ఎదురుచూస్తున్న రైతులకు కొనుగోళ్ల తేదీ వచ్చేసింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ.. కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా ఈనెల 23 నుండి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఉదయం 10 గంటలకు పత్తి కొనుగోళ్ల ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి

ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌లో ఆదిలాబాద్-ఏ, ఆదిలాబాద్-బీ, సీసీఐ సెంటర్ల ప్రారంభానికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. పత్తి పంటకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7521గా నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. సీసీఐ తేమ 8 శాతం నుండి 12 శాతం వరకు మాత్రమే కొనుగోలు చేస్తామని, తేమ 12 శాతం కంటే ఎక్కువ ఉన్న పత్తిని సీసీఐ ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయదని స్పష్టం చేశారు. అందుకు రైతులు తమ పత్తిని ఇంటి వద్దనే ఆరబెట్టుకొని ఎండిన తరువాత తేమ 8 శాతం మించకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి మార్కెట్ యార్డ్, సీసీఐ కొనుగోలు కేంద్రాలకు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ బుక్, మొబైల్ ఫోన్ (ఓటీపీ కోసం) తమ వెంట తీసుకొని రావాలని సూచించారు.

ఉదయం 9 నుండి 6 వరకు కొనుగోళ్లు

పని దినలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనుగోళ్లు జరుగుతాయని, సీసీఐ సాఫ్ట్ వెర్‌కు సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని, రైతులు మార్కెట్ యార్డ్, సీసీఐ కొనుగోలు కేంద్రాలకు వచ్చే లోడ్ వాహనాలను మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. తరవాత వచ్చే భర్తీ, లోడ్ వాహనాలను మరుసటి రోజు అనుమతించడం జరుగుతుందని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. ఒకేసారి కాకుండా దశల వారీగా సీసీఐ కేంద్రాలకు రావాలని సూచిస్తున్నారు. ఆదిలాబాద్ మినహా ఇతర సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో వచ్చే నెలలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలివే

బోథ్ మార్కెట్ కమిటీలో రాఘవేంద్ర సాయిదత్త, స్వప్న జిన్నింగ్, ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ, పొచ్చెరలో శ్రీ సాయిబాబా జిన్నింగ్, ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ, సోనాలలో సీసీఐ కేంద్రం శ్రీ గురుసాహెబ్ చందా కాటన్ ఇండస్ట్రీ, నేరడిగొండలో శ్రీ దర్శన ఇండస్ట్రీస్, ఇంద్రవెల్లిలో ఫార్మర్స్ ప్రొడ్యూస్ కంపెనీ, మిట్టల్ జిన్నింగ్ ఫ్యాక్టరీ, విజయలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్, నార్నూరులో గజనంద్ శ్రీ జిన్నింగ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ, ఎస్ఆర్ఎస్ఆర్ ఫార్మర్ ప్రొడ్యూస్ కంపెనీ లిమిటెడ్, ఇచ్చోడలో రాణి జిన్నింగ్ ప్రెస్సింగ్, ఇండస్ట్రీస్, గుడిహత్నూర్‌లో రాణి కాటన్ మిల్స్, శ్రీ లక్ష్మి జిన్నింగ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ, జైనథ్ మార్కెట్ కమిటీలోని బేల సీసీఐ కొనుగోలు కేంద్రం ఆశపూర జిన్నింగ్ మిల్లులో కొనుగోలు జరగనున్నాయి.



కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లాలోని పత్తి కొనుగోళ్లలోని రైతుల సమస్యలు, సందేహాలు, ఫిర్యాదులకు వివిధ శాఖల సమన్వయంతో మల్టి డిసిప్లినరీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ కార్యాలయ విస్తరణ అధికారి ప్రసాద్ 9014208626, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం జె. స్వామి 7893586672, సీసీఐ కార్యాలయం ప్రవీణ్ 9010780973, లీగల్ మెట్రాలజీ నవీన్ కుమార్ 8247767144, రవాణాశాఖ కార్యాలయ జైవంత్ రాథోడ్ 9177434577 ఈ నెంబర్లకు రైతులు సంప్రదించి తమ సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఉద్యోగులు సక్రమంగా సేవలందించాలి

- ఆర్జీయూకేటీ వీసీ గోవర్ధన్



నవతెలంగాణ-ముధోల్

ఆర్జీయూకేటీ బాసర ఉద్యోగులు సక్రమంగా సేవలు అందించాలని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి స్వాగత ఉపన్యాసం చేశారు. అకడమిక్, ఎగ్జామినేషన్ సెక్షన్, వాటర్, ఎలక్ట్రిసిటీ, ప్రొక్యూర్మెంట్, నెట్వర్కింగ్ అండ్ సాఫ్ట్వేర్ సెక్షన్ల అధికారులు తమ నివేదికలను అందించారు. నివేదికల ఆధారంగా విశ్వవిద్యాలయ పరిధిలో చేపట్టాల్సిన పనులు, తీసుకోవాల్సిన చర్యలను వీసీ వివరించారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ప్రతి విభాగపు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులతో సమావేశం నిర్వహించామన్నారు. సాంకేతిక పోటీ ప్రపంచంలో సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం నాన్ టీచింగ్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. విశ్వవిద్యాలయ పురోభివృద్ధికి నాన్ టీచింగ్ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్, వివిధ విభాగాల అధిపతులు, పీఆర్ఓ, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీసీని సన్మానించిన గెస్ట్ ఉద్యోగులు

బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో ట్రిపుల్ ఐటీ గెస్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కలిసి సన్మానించారు. అమ్మవారి ఫోటోను అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అందరి సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధి కోసం పని చేయాలని సూచించారు. సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేల కృషి చేస్తానని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గెస్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు ముత్యం, బైరు రాజేష్, కృష్ణ, నవీన్, రవి, సోఫియా, ప్రసూన పాల్గొన్నారు.

రోగుల సాంత్వనకే పాలియేటివ్ కేర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతూ చివరి దశలో ఉన్న వారికి సాంత్వన కలిగించేలా హస్పైస్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్ ఎంతో ఉపయుక్తమైన సేవలు అందిస్తోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.కృష్ణ తెలిపారు. శనివారం హాస్పైస్ అండ్ పాలియేటివ్ కేర్ డేను పురస్కరించుకుని రిమ్స్‌లోని పాలియేటివ్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగులకు రిమ్స్ డైరెక్టర్ డా. జైసింగ్ రాథోడ్‌తో కలిసి పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధికి చికిత్స పొంది మరణశయ్యపై ఉండే రోగులకు సాంత్వన కలిగించేలా రిమ్స్‌లోని హస్పైస్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్ కృషి చేస్తోందని తెలిపారు. 620 మంది బాధితులు ఈ సెంటర్ ద్వారా సేవలు పొందుతున్నారని, దీనికి తోడు మొబైల్ యూనిట్ కూడా పనిచేస్తోందన్నారు. వీరిలో అత్యధికంగా 196 మంది ఓరల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తెలిపారు. బాధను భరించలేని చివరి దశలో ఉన్న బాధితులకు ఈ కేంద్రం సాంత్వన కలిగిస్తోందన్నారు. ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్న బాధితుల సౌకర్యార్థం ఆదిలాబాద్ లోని రిమ్స్ హాస్పైస్ అండ్ పాలియేటివ్ సెంటర్ను 2018లో ప్రారంభించడం జరిగిందని డైరెక్టర్ తెలిపారు. అంకాలజి విభాగ వైద్యుడు డా. జక్కుల శ్రీకాంత్ రోగులను నిత్యం పరిశీలిస్తూ అవసరమైన చికిత్సలు అందిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్ఓ డా. సాధన, ఎన్‌సీడీ కార్యక్రమ అధికారి డా. శ్రీధర్, ఎన్ఎస్ఎం ప్రోగ్రాం అధికారి డా.వంశీకృష్ణ, పాలియేటివ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా.వెంకటేశ్, ఫిజియోథెరపిస్ట్ సునీత పాల్గొన్నారు.



జార్జి రెడ్డి స్ఫూర్తితో బకాయిల విడుదలకు పోరాటాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జార్జి రెడ్డి స్ఫూర్తితో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫిజురియంబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం పోరాటలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి చాంద్ పాషా సూచించారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో "50 వసంతల స్వర్ణోత్సవ సభ" పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏండ్ల పీడీఎస్‌యూ విప్లవ ప్రస్థానంలో అనేకమంది విద్యార్థి రత్నాలు బిగి పిడికిలి జెండా కోసం తమ ప్రాణాలు త్యాగం చేశారన్నారు. జార్జి రెడ్డి మతోన్మాద కత్తిపోట్లకి ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నేల కొరిగాడని తెలిపారు. విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ అనేక విజయాలు సాధించామని గుర్తు చేశారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 ఏండ్ల సందర్భంగా అక్టోబర్ 24న ఓయూలోని ఠాగూర్ ఆడిటరియంలో జరిగే 50 వసంతల స్వర్ణోత్సవ సభలను పూర్వ, ప్రస్తుత నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలనీ కోరారు. కార్యక్రమంలో మాజీ జిల్లా నాయకులు ఆస్థి రవి, లక్ష్మణ్, బండారి తిరుపతి, రత్నం పోషన్న, జిల్లా ఉపాధ్యక్షులు లెనిన్, పట్టణ నాయకులు రామ్‌కుమార్, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ ధ్యేయంగా ముందుకు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

తనకు ఏ జాతి వ్యతిరేకం కాదని, దేశద్రోహులే నా శత్రువులని సబ్ కా సాత్ సబ్ కా వికాస్ ధ్యేయంగా ముందుకు సాగుతానని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం పట్టణంలోని లక్ష్మీ నరసింహ కళ్యాణ మండపంలో పట్టణ, మండలానికి చెందిన 297 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు చెక్కులను అందించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం లబ్ధిదారులకు పథకాలు అందించడంలో తీవ్ర జాప్యం చేసిందని, తాను ఎన్నికయ్యాక పది నెలల కాలంలో 2500 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందించడం జరిగిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే తన ధ్యేయమని పేద ప్రజానీకానికి అన్నవేళల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రూ.లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఎంఐఎం పార్టీ సైతం పోరాడాలని సూచించారు. పట్టణంలో పలు సమస్యలున్నాయని మున్సిపల్ కౌన్సిలర్‌లు తెలియజేయడంతో త్వరలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రెవెన్యూ అధికారులు తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. గదులు లేక ఆఫీస్ సిబ్బంది ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వచ్చిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతు ఎమ్మెల్యేగా గెలిచిన నుండి రామారావు పటేల్ విద్య, వైద్యం, సాగునీటిపై దృష్టి సారించారని అందులో భాగంగానే బైంసా ఏరియా హాస్పిటల్‌కి సొంత నిధులు వెచ్చించి, అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బి. గంగాధర్, కౌన్సిలర్లు, ఎంఐఎం నాయకులు ఫైజుల్లా ఖాన్, అమీర్ హైమద్, బీజేపీ పట్టణ అధ్యక్షులు మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, సీనియర్ నాయకులు సొలంకి భీమ్‌రావ్, రమేష్, నాయకులు రావుల పోశెట్టి, గౌతం పింగ్లే, పండిత్ రావ్, బీజేపీ మండల అధ్యక్షులు భూమేష్, మహిళ నాయకురాలు సిరం సుష్మరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలున్నారు.

చట్టాల పట్ల అవగాహన ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థి దశ నుంచే చట్టాల పట్ల అవగాహన పెంచుకొని తగిన విధంగా రక్షణ పొందాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి సౌజన్య విద్యార్థినులకు సూచించారు. శనివారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో డిఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల సంరక్షణకు రూపొందించిన చట్టాలు, అఘాయిత్యాలకు పాల్పడిన సందర్భంలో నేరస్తులకు వేసే శిక్షలపై వారికి అవగాహన కల్పించారు. ఫోక్సో, జువైనల్ చట్టాలతో పాటు ర్యాగింగ్ యాక్ట్, బాలికా సంరక్షణ చట్టాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎల్ఎస్ఏ కార్యాదర్శి సౌజన్య మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉన్నపుడే వాటి ద్వారా రక్షణ పొందగలుగుతామని, ఈదిశగా విద్యార్థినులు చట్టాల గురించి తెలుసుకుంటూ తమకు గాని తోటి వారికి గాని అన్యాయం, అకృత్యం జరిగినపుడు న్యాయం పొందవచ్చని సూచించారు. వేదింపులకు గురైన సందర్భంలో నిర్భయంగా తమ ఉపాధ్యాయులకు గాని, తల్లిదండ్రులకు గాని తెలియజేయాలని సూచించారు. అలాగే సఖి కేంద్రాల ద్వారా సైతం రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, న్యాయరక్షకులు గంగారాం, అశోక్, ఉమేష్ రావ్, ప్యానల్ అడ్వకేట్ ఎం. అశోక్, కళాశాల ప్రిన్సిపాల్ జాధవ్ గణేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డుపై కుక్కలతో రోడ్డు ప్రమాదాలు

నవతెలంగాణ-తాంసి

రహదారులపై కుక్కలు, అడవి పందుల వల్లనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మండలంలోని కరంజి గ్రామానికి చెందిన సహకార ఉద్యోగి కర్నెవార్ గణేష్ ఆదిలాబాద్ నుండి తాంసికి ఉద్యోగ రీత్యా వస్తున్న తరుణంలో తలమడుగు మండలం ఖోడద్ గ్రామం వద్ద రోడ్డుపైకి ఒక్కసారిగా కుక్కలు రావడంతో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదానికి కుక్కలు మోటార్ సైకిల్‌కు అడ్డు రావడంతోనే ప్రమాదం జరిగింది. అదే విధంగా మండలంలోని పొన్నారి, ఖోడద్, సుంకిడి గ్రామాల్లో గతంలో కూడా ఎన్నో ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. రాత్రి వేళల్లోనైతే వాహనచోదకులు రోడ్డుపై రావాలంటేనే జంకుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాహనాదరుల వెంట పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. విచ్చలవిడిగా కుక్కలు రోడ్డుపై తిరిగిన అటు గ్రామస్తులు, అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కుక్కలు రోడ్లపై తిరగకుండా గ్రామపంచాతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

22న సంచార జాతుల కులస్తుల ఉన్నతి సమావేశం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలోని సంచార జాతుల కులస్తులకు ఈనెల 22 సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా కార్యాలయంలో ఉదయం 11గంటలకు సంచార జాతుల కులస్తులకు ఉన్నతి సమావేశం ఉంటుందని జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి డి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని సంచార జాతుల సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొనాలని కోరారు. ఇతర సమాచారం కోసం 9849290043 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.